క్లుప్తంగా

గంటన్నర నరకయాతన..!



నిలిచిపోయిన ట్రాఫిక్

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద బుధవారం ఉదయం ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురైంది. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. శ్రీకాకుళం-పలాస మధ్య రాకపోకలు జరిపే బస్సు రైల్వేగేటు వేయడంతో నిలిపివేశారు. అనంతరం గేటు ఎత్తే సమయంలో స్టార్ట్ కాకపోవడంతో బస్సు గేటు ముందు నిలిచిపోయింది. 11.30 గంటలకు ఈ సమస్య తలెత్తగా.. ఆ తరువాత వరుసగా రైళ్ల రాకపోకలు జరగడంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో వాహన చోదకులు, విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.

సామాజిక భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ దాస్ తదితరులు

సోంపేట: సోంపేట పట్టణంలో శ్రీశయన చైతన్య దీపిక సామాజిక భవనం నిర్మాణానికి ఎంపీపీ నిమ్మన దాస్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ నిధులతో భవనం పూర్తిచేయడానికి సహకరిస్తామని చెప్పారు. శ్రీశయన చైతన్య దీపిక ప్రతినిధులు తుంగాన వెంకటేష్, ఎ.వి.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు పొడుగు కామేష్, బొమ్మిడి ధర్మరాజు పాల్గొన్నారు.

42 మందికి నేత్ర పరీక్షలు

మందస: మందస సత్యసాయి మందిరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 42 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 23 మందికి కంటి శుక్లాల ఆపరేషన్‌కు శ్రీకాకుళం రిఫర్ చేశారు. నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ, సత్యసాయి సేవా సమితి సభ్యులు ఉన్నారు.

బదనికలతో కొబ్బరి తెగుళ్లకు నివారణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న మాధవీలత

కంచిలి: తెగుళ్ల బారిన పడిన కొబ్బరి తోటల్లో బదనికలు విడిచిపెట్టడం ద్వారా ఆయా పురుగులను నివారించవచ్చని ఉద్యానశాఖాధికారిణి పి.మాధవీలత అన్నారు. కత్తివరంలో కొబ్బరి రైతులతో బుధవారం సమావేశమై మాట్లాడారు. కొబ్బరి తోటలకు ఆశించిన నల్లముట్టె, తెల్లదోమ తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అంబాజీపేట నుంచి రైతులు బదనికలు తెప్పించుకొని తెగుళ్లబారిన పడిన తోటల్లో విడిచిపెట్టాలని సూచించారు. ఇప్పటికే మకరాంపురం, కొజ్జిరియా గ్రామాల్లో బదనికలు విడిచిపెట్టే పద్ధతిలో నివారణ చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఉద్యానశాఖ హెచ్‌ఈవో బాలరాజు, ఎండీఈవో లలిత, వీహెచ్‌ఏ గంగరాజు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

పలాస: అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, జిల్లా కార్యదర్శి కె.రమణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద బుధవారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఏవో ప్రకాశరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేస్కేలు వర్తింపచేయాలని, నామిని వీఆర్‌ఏలను వీఆర్‌ఏలుగా క్రమబద్ధీకరించాలన్నారు. సంఘ మండల అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మణరావు, కార్యదర్శి బి.తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు సీహెచ్ సింహాచలం, వెంకటరావు, బైరాగి, భానుకుమారి, రేణుకా, ఇందిరా పాల్గొన్నారు.

కంకర తవ్వకాలపై ఫిర్యాదు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి సూదికొండపై అక్రమంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయని.. తక్షణమే అధికారులు చర్యలు చేపట్టాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఆర్డీవో వెంకటేష్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సూదికొండ ప్రాంతంలో అక్రమంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయని వినతిలో పేర్కొన్నారు.

పాఠశాలకు వాటర్ ప్లాంట్ వితరణ

టెక్కలి రూరల్: రావివలస జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వపు విద్యార్థి బుసకల రమేష్ ఔదర్యాన్ని చాటుకున్నారు. రూ.1.40 లక్షల విలువ చేసే మినరల్ వాటర్ ప్లాంట్‌ను పాఠశాలకు వితరణగా బుధవారం అందజేశారు. సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, గ్రామ పెద్దలు బి.జగదీష్, ఎన్.కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది..!

- సచివాలయాలను వేధిస్తున్న సిబ్బంది కొరత
- గత ప్రభుత్వ లక్ష్యానికి కూటమి సర్కార్ తూట్లు
- ఇన్‌చార్జిలతో తప్పని ఇక్కట్లు
- సేవలు అందక ప్రజలు ఇబ్బందులు

వజ్రపుకొత్తూరు రూరల్:

గ్రామ స్వరాజ్యం కోసం కలలుగన్న మహాత్మ గాంధీ ఆశయాలకు అనుగుణంగా గ్రామస్థాయిలోనే ప్రభుత్వ పాలన అందించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయిలోనే సంక్షేమ పాలన అందించేందుకు పంచాయతీ, వార్డు స్థాయిలలోనే సచివాలయాలను ఏర్పాటు చేసింది. దీనికి అనుసంధానంగా రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చి వాటిలో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించింది. పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్,వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామ సర్వేయర్, అసిస్టెంట్ ఇంజినీర్, అగ్రికల్చర్ అసిస్టెంట్, హెల్త్ అసిస్టెంట్, విద్యుత్ సహాయకులు, వెటర్నరీ అసిస్టెంట్‌తో పాటు మహిళ పోలీసు ఇలా 13 పోస్టుల తో సిబ్బందిని నియమించి ప్రజలకు పూర్తిస్థాయి లో సేవలు అందించారు. అలాంటి సచివాలయాలు ప్రస్తుతం ఉనికిని కోల్పోయే పరిస్థితిలో పడ్డాయి. కూటమి సర్కార్ ఏర్పాటైన తరువాత సచివాలయ వ్యవస్థ ఛిన్నాభిన్నమైందనే ఆందోళన ప్రజల్లో నెలకుంది. తగినంత మంది సిబ్బంది లేక సేవలు పడకేశాయి.



వజ్రపుకొత్తూరులో సిబ్బంది లేక వెలవెలబోతున్న సచివాలయం

పలాస నియోజకవర్గంలో పరిస్థితి ఇలా..

మండలం	సచివాలయాలు	ప్రస్తుతం ఉన్న సిబ్బంది	ఇంకా కావల్సిన సిబ్బంది
వజ్రపుకొత్తూరు	27	180	34
పలాస	16	128	29
మందస	29	210	110

ప్రజల అవస్థలకు ప్రధాన కారణం..

సచివాలయ వ్యవస్థపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, అరకొరగా ఉన్న సిబ్బంది కూడా ప్రజలకు అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి. బదిలీల తర్వాత కొన్ని సచివాలయల్లో ఉద్యోగులు విధుల్లో చేరలేదు. కొంతమంది యువ ఉద్యోగులకు వివాహాలు కావడంతో వారు కార్యాలయాల ముఖం చూడడం లేదు. మరికొంతమంది వ్యక్తిగత కారణాలతో లాగ్ లీవ్ పెట్టేశారు. అలాగే అరకొరగా ఉన్న సిబ్బందిని కూటమి ప్రభుత్వం సర్వేల పేరిట బయటకు పంపిస్తుండడంతో సచివాలయాల్లో అందుబాటులో ఉండడం లేదు. కూటమి నాయకుల వేధింపులు భరించలేక కొంతమంది సెలవులు పెట్టేస్తున్నారు. అలాగే ఇన్‌చార్జిలు సైతం అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు సరైన సేవలు అందడడం లేదు. దీంతో ఒకప్పుడు కళకళలాడిన సచివాలయాలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. గతంలో నిమిషాల వ్యవధిలో ప్రజలకు కావాల్సిన సేవలు అందేవి. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. సిబ్బంది కొరత కారణంగా సేవలు పడకేశాయి. సచివాలయాల్లో ఏర్పడిన ఖాళీలను సైతం కూటమి ప్రభుత్వం భర్తీ చేయలేదు.



సిబ్బంది లేక గొళ్లెంతో దర్శనం ఇస్తున్న సచివాలయం

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం



గత ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుంది. సచివాలయల్లో తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పలు ధ్రువపత్రాల కోసం సచివాలయ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం మెరుగుపర్చాలి.

– ఎస్.మోహన్‌రావు, సీఐటీయూ నాయకులు, వజ్రపుకొత్తూరు మండలం

ఇన్‌చార్జిలతో ఇబ్బంది



సచివాలయాల్లో పూర్తిస్థాయిలో ఉద్యోగులు లేకపోవడంతో ఇన్‌చార్జిలతో నెట్టుకువస్తున్నారు. అయితే వీరు కూడా సచివాలయాల్లో అందుబాటులో లేకపోవడంతో ప్రజలు అనేక ఇక్కట్లు పడుతున్నారు. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాలు, భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. భూ సమస్య పరిష్కారం కోసం నెలల తరబడి తిరుగుతున్నా పనిజరగడం లేదు.

– బి.ఆనందరావు, రైతు సంఘ నాయకుడు, పూండి గల్లి, వజ్రపుకొత్తూరు మండలం

జగనన్న కాలనీలో అక్రమ నిర్మాణాలు తొలగింపు

టెక్కలి: టెక్కలి జగతిమెట్ట సమీపంలోని జగనన్న కాలనీలో ఇటీవల చేపట్టిన అక్రమ నిర్మాణాలను బుధవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులంతా కాలనీలో పలు అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఇటీవల చేపట్టిన సర్వేలో భాగంగా కొన్ని అక్రమ కట్టడాలు ఉన్నట్లు గుర్తించారు. మొదటి విడతగా అటువంటి కొన్ని నిర్మాణాలను తొలగించి హెచ్చరికలు జారీ చేశారు. జగనన్న కాలనీలో అర్హులైన వారికి ఇచ్చిన ఇంటి స్థలాల కబ్జాలు, అక్రమ పట్టాలు, అమ్మకాలు, కొనుగోలు చేసినటువంటి స్థలాను స్వాధీనం చేసుకుంటామని అలాగే అటువంటి స్థలాల్లో చేసిన కట్టడాలను కూల్చివేస్తామని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా కొంత మంది రెవెన్యూ అధికారులకు చెందిన కుటుంబ సభ్యులకు అక్రమంగా ఉన్నటువంటి కట్టడాలను కూల్చివేస్తారా.. లేక వదిలేస్తారా.. అంటూ స్థానికులు చర్చించుకున్నారు.



జగతిమెట్ట సమీపంలో జగనన్న కాలనీలో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న అధికారులు.

దప్పు కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలి

కాశీబుగ్గ: అర్హులైన డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని డప్పు కళాకారుల సంఘం నాయకులు తోట సిమ్మయ్య, రుంకు రామారావు, రోకళ్ల తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు కాశీబుగ్గ పాత బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి శ్రీనివాస జంక్షన్ వరకు బుధవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం మంకి నమ్మ గుడి ఆవరణలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనేక పోరాటాలు ఫలితంగా ప్రభుత్వాలు పింఛన్లు, ఐడీ కార్డులు మంజూరు చేశాయని..అయితే ఇంకా అనేకమంది అర్హులు మిగిలి ఉన్నారని తెలిపారు. సమస్యలపై ఈ నెల 21న ఆర్డీవోకు వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెయ్యిల గణపతిరావు, జోగి జనార్దన, ఎ.నాగేశ్వరావు, సీహెచ్ చరణ్, టి.భగీరధి, జి.హరికృష్ణ, పి.శివరాం, జి.దాసు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న డప్పు కళాకారులు

తొలగిన ఆధార్ ఇక్కట్లు

పలాస: రెంటికోట గ్రామ సచివాలయం పరిధిలోని ప్రజలకు ఆధార్ ఇక్కట్లు తొలగిపోయాయి. బుధవారం నుంచి ఆధార్ అప్‌డేట్స్ ప్రక్రియ సజావు జరుగుతుంది. 'రెంటికోటలో ఆధార్ ఇక్కట్లు'శీర్షికతో ఈ నెల తొమ్మిదో తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి జిల్లా అధికారులు స్పందించారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ హేమాశ్రీని శ్రీకాకుళం పిలుపించుకొని కొత్త ఆధార్ కిట్టును అందించారు. ఆమె వెంటనే సచివాలయానికి చేరుకొని ఆధార్ సెంటర్‌ను కొనసాగించారు. 27 మందికి ఆధార్ అప్‌డేట్స్‌ను చేశారు.

సాక్షి ఎఫెక్ట్...



ఆధార్ అప్‌డేట్స్‌ను చేస్తున్న డిజిటల్ అసిస్టెంటు హేమాశ్రీ

అందరి సహకారంతోనే వన్యప్రాణులకు రక్షణ

ఇచ్ఛాపురం: దారితప్పి జనావాసాల్లోకి వస్తున్న వన్యప్రాణులకు రక్షణ కల్పించవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని డిప్యూటీ రేంజ్ అధికారి ఐ.రాము అన్నారు. 'వన్యప్రాణులకు రక్షణ కరువు'శీర్షికతో ఈనెల ఆరో తేదీన 'సాక్షి'లో వచ్చిన కథనానికి కాశీబుగ్గ డివిజన్ ఫారెస్ట్ అధికారులు స్పందించారు. ఈ మేరకు పురపాలక సంఘం పరిధి రత్తకన్న గ్రామంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి కాశీబుగ్గ మురళీకృష్ణనాయుడు ఆదేశాల మేరకు వన్యప్రాణుల రక్షణపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. వేసవి వేడిని తట్టుకోలేక నీటి కోసం రత్తకన్న గ్రామానికి ఆనుకొని ఉన్న పీర్లకొండ, సూదికొండలపై ఉండే వన్యప్రాణులైన జింకపిల్లలు గ్రామాల్లోకి వస్తూ వీధికుక్కల దాడుల్లో మృత్యువాత పడుతున్నాయన్నారు. వన్యప్రాణులు దారితప్పి గ్రామాల్లోకి వస్తే వాటిని రక్షించి అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం వన్యప్రాణులను వేటాడడం, అక్రమంగా రవాణ చేయడం, వాటికి హానికలిగించడం వంటివి చట్టరీత్యానేరమని అవగాహన కల్పించారు. వన్యప్రాణుల రక్షణ కోసం అటవీశాఖ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారి, ఫారెస్టు సిబ్బంది పి.భానుమూర్తి, వెంకటేష్, లక్ష్మణమూర్తి, సురేష్, దుర్గాదేవి, జోగారావు, స్థానిక న్యాయవాది జి.సీతయ్యరెడ్డి, రత్తకన్న గ్రామపెద్దలు, యువత పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్...



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

13న వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకుల ప్రమాణం

ఇచ్ఛాపురం టౌన్: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల కార్యవర్గాలు ఈనెల 13న శ్రీకాకుళంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ విషయాన్ని పార్టీ పట్టణ అధ్యక్షులు బలివాడ ప్రకాష్‌రావు పట్నాయక్ బుధవారం తెలిపారు. జిల్లా కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి పట్టణంలో వివిధ హోదాల్లో నియమితులైన వారంతా హాజరు కావాలని కోరారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

ఇచ్ఛాపురం రూరల్: పిల్లలకు విధిగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ సీడీపీవో పి.నాగరాణి అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతల ఇళ్లకు బుధవారం వెళ్లి వ్యాధి నిరోధక టీకాల షెడ్యూల్‌ను పరిశీలించారు. సూపర్‌వైజర్లు బి.సుజాత, జె.లక్ష్మి, పి.పల్లవి, పి.పుష్పలత ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం పీహెచ్‌సీలో 37 మంది గర్భిణులకు బుధవారం వైద్యులు డాక్టర్ వెచ్చా సంతోష్ చలమాజీ, డాక్టర్ రమ్యాలు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త హీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

రామాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీ పరిధి దాసన్నపేటలోని కోదండ రామాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ ఎం.ముకుందరావు బుధవారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దొంగతనాల నియంత్రణలో భాగంగా ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

త్వరితగతిన ఈకేవైసీ ప్రక్రియ చేపట్టాలి

కంచిలి: రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు త్వరితగతిన ఈకేవైసీ ప్రక్రియను చేపట్టాలని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో మండల రేషన్ డీలర్లతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అలాగే డీలర్ల ఆథరైజేషన్ రెన్యువల్ గురించి వివరించారు. ఈ నెలాఖరులోగా ఈ రెండు అంశాలను పూర్తిచేయాలన్నారు. సీఎస్‌డీటీ పి.కూర్మారావు, డీలర్ల సంఘం అధ్యక్షుడు కె.నాగరాజు, ఉపాధ్యక్షుడు ప్రసాద్ ఉన్నారు.

డ్రగ్స్ వినియోగిస్తే 1972కు సమాచారం ఇవ్వండి

టెక్కలి: డ్రగ్స్ వినియోగించినా, అమ్మకాలు చేసినా తక్షణమే 1972 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని టెక్కలి ఎస్‌ఐ కె.రాము సూచించారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వినియోగం వలన కలిగే చెడుపై వివరించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్ పీవీఎన్ ఆచార్యులు, బి.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధిపై అధికారుల పరిశీలన

టెక్కలి: టెక్కలి నియోజకవర్గం పరిధిలో పర్యాటక అభివృద్ధిపై ఆయా శాఖ అధికారులు బుధవారం పరిశీలన చేశారు. పర్యాటక శాఖ ఈఈ కె.రమణ, జిల్లా పర్యాటక శాఖ మేనేజర్ ఎస్.నారాయణరావు, ఏఈ పి.మదన్‌మోహన్ తదితరులు భావనపాడు సముద్రతీరం, టెక్కలి జగతిమెట్ట, పట్టుమహదేవి కోనేరు, కోటబొమ్మాళి దరి కొత్తపేట కొండను పరిశీలించి ప్రాథమికంగా డీపీఆర్‌ను రూపొందించారు. అనంతరం కోటబొమ్మాళిలో మంత్రి అచ్చెన్నాయుడును కలిసి పర్యాటక అభివృద్ధిపై చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. టెక్కలి ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్ ఉన్నారు.

ఆర్థికసాయం..

సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలస గ్రామానికి చెందిన చెల్లూరి రవి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స పొందుతున్నారు. నిరుపేద కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న కోటబొమ్మాళి మండలం చలమయ్యపేట గ్రామ సంఘం సభ్యులు అండగా నిలిచారు. రూ. 32 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడికి బుధవారం అందజేశారు. సంఘం సభ్యులు అంగ గున్నయ్య, జి.వీరస్వామి, బాలరాజు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



–టెక్కలి రూరల్

విగ్రహ దాతలకు సత్కారం

ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో రామాలయం పునః ప్రతిష్ఠ సందర్భంగా స్వామి వారి మూల వీరాట్ విగ్రహాలను అందించిన దాత కేతిరెడ్డి లక్ష్మీలత, వేనియర్ దంపతులను ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. బుధవారం ఆలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పండితులు నీలగిరి రామకృష్ణ, చంద్రశేఖర్ శతపతి, ఎస్సీ శ్యామ్‌సుందర్ వేద మంత్రోచ్ఛరణలతో సత్కరించి గౌరవించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్, సర్పంచ్ నర్తు వరప్రసాద్ యాదవ్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, నర్తు భానోజీ పాల్గొన్నారు.



–ఇచ్ఛాపురం రూరల్

ఆలయ ప్రతిష్ఠ..

కంచిలి మండలంలో ఘాటీముకుందాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం జరిగిన కార్యక్రమాల్లో స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతోపాటు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల పార్టీ నేతలు లడ్డు కేశవపాత్రో, కొణపల సురేష్, ఇందుగు సీతారాం, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



–కంచిలి

అడుగంటినది!

- ఆందోళనలో ఇచ్ఛాపురం పురప్రజలు



ఎండిపోయిన బాహుదా నది

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకుంది. దీనికి కారణం పట్టణానికి ప్రధాన తాగునీటి వనరైన బాహుదానది పూర్తిగా ఎండిపోవడమే. వేసవి నేపథ్యంలో నదిలో నీటి నిల్వలు తగ్గిపోయాయి. పట్టణంలోని 20 వార్డులకు బాహుదానదిలో ఉన్న ఊటబావుల నుంచి పైపులైన్‌ల ద్వారా కుళాయిలకు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే కొద్దిరోజులుగా నదిలో నీటి నిల్వలు లేకపోవడంతో ఊటబావులు సైతం అడగంటిపోవడంతో పట్టణ వాసులకు నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ట్యాంకర్ల నీటిని అధికారులు సరఫరా చేస్తున్నప్పటికీ అవి ప్రజల అవసరాలను తీర్చలేకపోతున్నాయి. ఈ పరిస్థితిలో సమీపంలో ఉన్న ఒడిశాలోని బగలబట్టి డ్యాం నుంచి నీటిని బాహుదానదికి విడిచిపెడితే పట్టణ వాసులకు నీటి కష్టాలు తీరుతాయి. దీని కోసం ఇప్పటి నుంచే మున్సిపల్ అధికారులు, పాలకులు, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఒడిశా అధికారులు, పాలకులతో చర్చించాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఈ వేసవిలో నీటి అవస్థలు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ వద్ద ప్రస్తావించగా..వేసవిలో తీవ్ర నీటి సమస్య ఉండే అవకాశం ఉందనే విషయాన్ని ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఒడిశా అధికారులతో మాట్లాడాలని కూడా కోరామన్నారు.

పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలి



టెక్కలి: నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు



కాశీబుగ్గలో నిరసన తెలియజేస్తున్న దృశ్యం

టెక్కలి: పేద, సామాన్య వర్గాలకు గుది బండగా పెంచిన వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం టెక్కలిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు ఏకంగా వంట గ్యాస్ ధరలను పెంచేశారని మండిపడ్డారు. తక్షణమే వంట గ్యాస్ ధరలను తగ్గించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్.షణ్ముఖరావు, కె.ఎల్లయ్య, బి.వాసుదేవరావు, బి.ధర్మారావు, కాంతారావు, దుర్గాప్రసాద్, హెచ్.ఈశ్వరరావు, సరస్వతి, మాధవరావు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: కేంద్రం ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోనారి మోహనరావు డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ కాశీబుగ్గలోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. సిలిండర్‌పై రూ.50 పెంచడం దారుణమన్నారు. సీపీఎం పలాస కార్యదర్శి నెయ్యిల గణపతిరావు, సభ్యులు కె.సుహాసిని, ఎన్.డిల్లేశ్వరి, తెప్పల అజయ్‌కుమార్, కె.బాలాజీ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

కంచిలి: చక్కని విద్యాబోధనతోపాటు అన్ని సౌకర్యాలు ఉండే ప్రభుత్వ పాఠశాలల్లోనే బడుఈడు చిన్నారులను చేర్పించాలని ఎంఈవో-1 ఎస్.శివరాంప్రసాద్ కోరారు. ఈ మేరకు డి.జి.పురం గ్రామంలో ఉపాధిహామీ పనులు చేపడుతున్న వేతనదారులతో బుధవారం సమావేశమయ్యారు. ప్రభుత్వం ఉచిత పుస్తకాలను, మధ్యాహ్న భోజనాన్ని, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన చేపడుతున్నట్లు చెప్పారు.



వేతనదారులతో మాట్లాడుతున్న శివరాంప్రసాద్